# తీరని సమస్య

ద్రౌపది రంభ అని ఎవరూ ఎన్నడూ అనలేదుగాని, పదేళ్ళ క్రితంకూడా ఎరిగినవాళ్ళు, "దానికేం ? చక్కగా, కనుముక్కుతీరుగా ఉంటుంది." అనుకునేవాళ్ళు ఇప్పుడెవరన్నా దాని పెళ్ళివిషయం మాట్లాడేప్పుడు, "ఆఁ, ఏంచూసి చేసుకుంటారు, బాబూ ? వాళ్ళ నాన్న ఇచ్చే కట్నంచూశా ? దాని అందచందాలుచూశా ?" అని చప్పరిస్తున్నారు. ద్రౌపది మారిపోయింది.

ఎందుకు మారదూ ? ఇరవై తొమ్మిదికూడా వెళుతుంది, ఇంతవరకూ పెళ్ళికాలేదు. అయేటట్టుకూడా లేదు. బియ్యే పాసయింది. ఉద్యోగంలేదు. అన్న కామేశ్వర్రావు రెక్కలమీద సంసారం నానా అగచాట్లుగా వెళుతున్నది. అతనికి అప్పుడే ఆరుగురు పిల్లలు. రోగిష్టి పెళ్ళాం. పిల్లన్ని కనటానికి తప్ప మిగతాఅన్ని పనులకీ ఆవిడకి రోగమే. అ రోగిష్టి పెళ్ళాన్ని కనిపెట్టుకుని ఉండేటందుకు రోగిష్టి అత్తగారు. ఒక జల్లుపడ్డా, కాస్సేపు నీళ్ళల్లో నానినా ఆవిడకి కాళ్ళుపట్టుకుపోయి యమబాధ పడుతుంది. ఆచారవంతురాలు గనక నీటిలో నానటం రోజూ ఉంటుందనే చెప్పొచ్చు. ముసలాయనకి - అంటే ద్రౌపది తండ్రికి— ఆస్తి పోయిన

నాటినుంచి మతిసరిగా లేదు. అస్తమానం ఇంట్లోనే కూచుం టాడు. ఇంటి ఇబ్బందులన్నీ ఆయన్ని, పాపం, బాధిస్తూంటా యల్లే ఉంది. వాటిని గురించే మననం చేస్తూఉంటాడు. ఎప్పు డన్నా కామేశ్వర్రావు తండ్రిమీద విసుక్కుంటాడు.

"ఆర్చేవాడివా, తీర్చేవాడివా? నీ కెందుకయ్యా? ఏంరోగాలో, ఏంబాధలో, ఏం దరిద్రమో మేం పడుతు తున్నాంగా? వేళకింతతిని హాయిగా కూచో, ఏబాధా లేదనుకో."

ముసలాయనికి అది యిష్టంలేదు. ఎద్దుదున్నితే జోరీగ రొప్పిందన్నట్టు, నిజమైన శ్రమంతా కామేశ్వర్రావు పడు తుంటే, ఆతనికి సానుభూతిగా కాబోలు, కర్మ, ముసలాయన మూలుగుతూ ఉండేవాడు. అటువంటి పరిస్థితిలో కామేశ్వ ర్రావే తనని కోప్పడేసరికి ఆయనకి కష్టం వేసేది. వెంటనే ద్రౌపదిమీద విరుచుకుపడేవాడు:

"నీ మొహం తగలెయ్యా, నీ చదువు చట్టుబండలు గానూ! నా ఆస్తంతా నీ చదువుకిందే ధారపోశానే! నీ చదువంతాపెట్టి ఒక్క రూపాయి సంపాదించగలవుటే? ఆ డబ్బంతా వాడికింద ఖర్చుపెట్టి ఏ ఇంగ్లండో పంపిస్తే వాడికి వేలకువేలు జీతంవచ్చి ఉండునుగదే! వేలకువేలు! నీ మొహాన దేవుడేంరాత రాశాడోగాని నిన్నెవడూ పెళ్ళ యినా చేసుకోడేమే? కుంటివాళ్ళకీ, గుడ్డివాళ్ళకీ క్షణంలో పెళ్ళవుతుందిగాని నీకుమటుకు కాదే! నీ కసలు మొగుడంటూ పుట్టి ఉంటేగా?"

వీటన్నిటికి ద్రౌపది సమాధానం చెప్పగలదు. కాని ఏమిటి లాభం? ఒక్కోసారి ఈ మాటలకు ద్రౌపది ఏడిచేది. కాని పైవాళ్లు, "ఛీ, ఊరుకో. మతిలేనివాడి మాటలు పట్టించుకుంటారా?" అని సమదాయించేవాళ్లు. సమదాయింపు సులభం. గురి లేనివాడు రాయి విసిరినా తగిలితే నొప్పెత్తుతుంది. మతిలేనివాడితో కలిసి ఉంటూ మతిగలిగిన మనిషల్లే నెళ్ల తరబడి ఉండటం చాలా కష్టం. పిచ్చి, హిస్టీరియా మొదలైనవి మానసిక అంటు వ్యాధులు... ద్రౌపదికి అనేకసార్లు సందేహం కలిగింది, తనకు మతి సరిగాఉందాఅని...

ఇంటిల్లిపాదికీ పనిచెయ్యటానికి ఆరోగ్యంగా ఉన్న మనిషి ఇంటి కంతకీ ద్రౌపది ఒకతే ఆమె ఆ యింట్లో చేసే పని ఎవరన్నా సంపన్నులకి చేస్తే నెలకొక వందరూపాయి లిస్తారు. కానీ, కామేశ్వరావేం ఇవ్వగలడు. అతను తెచ్చుకునేదే నూటపాతిక. అందుచేత ద్రౌపది ఈ చాకిరీయావత్తూ తన సొంతానికనుకునే చెయ్యాలి.

దురదృష్టవశాత్తూ ఈ కొంపలో ఈ చాకిరీ తప్పిస్తే ద్రౌపదికి సొంతం ఇంకేమీలేదు. ఈ ఇల్లు తనదనీ, ఈ ఇంటో తనకు సహజమైన స్థానం ఉందనీ ద్రౌపది విశ్వసించటం మానేసి అయిదారేళ్లింది.

ముసలాయన మతి పూర్తిగా చెడకముందే, "దీని పెళ్లయితేనేగాని నాకు మంచిరోజులు రావు. చక్రం చూసినవాడల్లా ఆ మాటే అంటున్నాడు." అని ప్రారంభించేడు. కాలక్రమేణ ఈ పాటికి చాలా సంగతులు చేరాయి. "రోజూ

లేని దీని మొహంచూసి బయటికి వెళ్ళితే ఎవడూ ఎర్రవీగానీ చేతిలో పెట్టడుగదా!"... దీనికి పెళ్ళయే దేమిటి? నా అదృష్టం తిరిగే దేమిటి?"...ముసలాయన అట్లా ఎడమై పోయాడు.

కామేశ్వర్రావు మరోరకంగా ఎడమై పోయినాడు. అతను చెల్లెల్ని పోషించలేకపోవటం గాని, ఎట్లాగైనా ఆమె పెళ్లి అయిపోయి కాపరానికి వెళ్లిపోతే తన భారం కొంత తగ్గుతుందనుకోవటంగాని అయితే ద్రౌపది అంతగా విచారించి ఉండదు. ఆమెకూడా చదువుకున్నదే. అర్థం చేసుకోగలదే. కాని కామేశ్వ రావు అచ్చగా అంతటితో ఆగలేదు; ఆమెకు వొట్టి చచ్చు సంబంధాలు తెచ్చి ముడిపెట్టాలని తొందర పడ్డారు. అందమూ, గుణమూ లేనిచోట డబ్బు కోసం గడ్డితినేవాళ్ళనే మనం ఎంతో నీచంగా చూస్తాం. అందమూ, గుణమూ, డబ్బూకూడా లేని దిక్కుమాలిన వెధవలకి తన చెల్లెల్ని అంటగట్టాలని చూశాడు కామేశ్వర్రావు. ఆ సంబంధాలను గురించి ద్రౌపదితో అబద్ధాలాడి దొరికిపోయినాడు. ఆమె వొదిలిపోతే చాలు, అవతల ఆమె గతి ఏమైనాసరే అనే స్థితికి అతను వచ్చాడని తెలిసినాక ద్రౌపది అన్నని పరాయివాడికింద కట్టేసింది. అంత అసమర్థపు స్థితిలో ఉన్న ద్రౌపది అన్నని పరాయివాడికింద కట్టటం కంటె ఇంకేవిధంగా శిక్షించగలదు?

అతనికి తనమీద సోదరప్రేమ లేకపోతే లేకపోయింది; తన పిల్లలకీ, పెళ్లానికీ, చివరకి అత్తగారికీకూడా చచ్చేట్టు చాకిరి చేస్తున్నందుకు కామేశ్వర్రావు తనమీద ఆపాటి

కృజ్ఞత చూపగూడదా ? ఏ బ్రష్టుణ్ణో, అతనిమాటచొప్పునే, పెళ్లాడి తనదారిన తాను కాపరం వెళ్ళిపోతే మర్నాడు ఈ కుటుంబం గతి ఏంకాను? ఆ సంగతి అతను ఆలోచించలేడా ?

తన తండ్రీ, అన్నా దూరమైనాక ఆ ఇంటో ద్రౌపదికి దగ్గిరవాళ్ళెవరు? ఈ విషయాలన్నీ ఎవరితో చెప్పుకుంటుంది? బయటికి అనుకోవటానికి లేని ఈ భాధ ఆమె మనస్సును తొలచి డొల్ల చెయ్యసాగింది. ఇది ఆమె జీవితానిక తెగని సమస్య. ఇందులో పెళ్ళీ. డబ్బూ, స్వేచ్ఛా - ఈ మూటి తాలుకు పోగులూ చిక్కుపడి ఉన్నై.

ద్రౌపది తనకు పెళ్లి కాలేదని మనోవ్యాధి పాలు కావటం ఇతరుల కెంత సహజంగా కనిపించినా, ఆమె విషయంలో అది కృత్రిమంగా తయారయిన సమస్యే. ఎందుకంటె ఒకప్పుడు ఈ తండ్రే ఆమె జీవితానికి చదువే ముఖ్యమైన విషయంగానూ పెళ్ళి అముఖ్యంగానూ మాట్లాడాడు. ఒకప్పుడామెను చేసుకుంటామని వచ్చిన సంబంధాలు తోసేసి, అవమానించాడు. అది ఆయనకు జ్ఞాపకంలేదు. ద్రౌపదికి జ్ఞాపకం ఉంది. అదికాక మొగుడు లేడనే చింతే అయితే ఏ ఆడదాన్నీ కుంగదీయదు; మొగుళ్ళుపోయి వైధవ్యంమీదపడి రాళ్ళల్లే ఉన్న వితంతువులు చాలామంది ఉన్నారు.

కాని ఆవాతావరణంలో ఇప్పుడు ద్రౌపది మామూలు మనిషికాదు. ఆమెకిప్పుడు పెళ్ళితప్ప గత్యంతరంలేదు. ఈ ఇల్లూ, వాతావరణమూ వొదిలించుకోవాలంటే పెళ్ళితప్ప

మరోమార్గం లేదు. పెళ్ళయితే మిగతా సమస్యలన్నీ తీరు తాయి. ఎంతకీ ఆ పెళ్ళే కాకుండా ఉంది.

"నేను మబ్బుల్లో కూచుని నిజం తెలుసుకోకుండా ఉన్నానా? కామేశ్వర్రావు నన్ను చేసుకోమన్న సంబంధాల కంటే నాకు మంచివి రాదగవా? అతను నా యోగ్యత సరిగానే అంచనాకట్టాడా? నన్నుగురించి నాకు ఎంత అధమమైన అభిప్రాయం తెచ్చిపెట్టుకున్నా, ఇతరులకు నామీద ఇంకా తక్కువ అభిప్రాయం ఉన్నట్టుగా తోస్తుందే! ఏమిటి కారణం? ఇంకా ఎంతని కుంగను? దానికి అంతెక్కడ?" అనుకునేది ద్రౌపది. ఒక్కసారి ఆమెకి ఆత్మవిశ్వాసం ఏమీ లేకుండాపోయి "ఈసారి ఎవడన్నా పెళ్లి చేసుకుంటాననివస్తే కళ్ళు మూసుకుని ఒప్పేసుకుంటాను. నేననవసరంగా ఎందుకు మధనపడాలి? నిండా మునిగినవాడికి చలేమిటి? ఏ పెళ్ళి చేసుకున్నా ఇంతకన్నా దరిద్రంగానూ, నిర్బంధంగానూ, ఉండదుగదా? ఏదైనా ఉన్నవాళ్ళకి పోతుందని భయంగాని, ఏమీలేని నాబోటి దానికి పోయ్యేదేమిటి? ఈసారి ఎవడు వచ్చినా చేసుకుంటాను. ఇది నిశ్చయం," అనుకునేది.

ద్రౌపదికి పరీక్షగా ఒక సంబంధం వచ్చింది. వరుడికి యాభై అయిదేళ్ళు. ఇటీవల భార్య పోయింది. అయిదారుగురు సంతానం. ఆయనకి తలిదండ్రులున్నారు. తండ్రికి పిచ్చి, తల్లి వ్యాధి పీడితురాలు. ఆచారవంతురాలైన విధవ చెల్లెలొకతె ఉంది. చిన్నపిల్లలని చేసుకోమని ఆవిడగోలట. ఈయన కాస్త లోకజ్ఞాని. పెద్దదాన్నే చేసుకుంటానని వచ్చాడు. ద్రౌపదిని చూసి వెళ్లాడు.

ఆయన విషయాలన్నీ వినగానే ద్రౌపదికి అపుకో లేకుండా నవ్వొచ్చింది. ఈ పెళ్ళయితే తన జీవితంలో ఏమీ మార్పుండదు. ఇక్కడున్న మనుషులకు నకళ్లే వాళ్ళూనూ. వీళ్లు చూసినట్టే తనని వాళ్ళూ పరాయిగా చూస్తారు. ఎందుకీ పెళ్ళి ?

"నా కక్కర్లేదీ సంబంధం! అందామని నోటిదాకా వచ్చింది. కాని బలవంతాన నోరు నొక్కేసుకుంది.

మర్నాడు కామేశ్వర్రావు కబురు తెచ్చాడు. ఆ పెద్ద మనిషికి ద్రౌపది మరీ సన్నగా, జబ్బుగా కనిపించిందిట. ఆయన ఇంకో సంబంధం—పద్ధెనిమిదేళ్ళ పిల్లని—స్థిరపరుచుకున్నాడుట.

కథా నిలయం
శ్రీకాకుళం